
సాక్షి
నల్లగొండ
గురువారం । 15 । జూన్ । 2023



ఖిలా.. దశ తిరిగేలా..
భువనగిరి ఖిలాను అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం స్వదేశీ దర్శన్‌-2లో భాగంగా రూ.100 కోట్లు కేటాయించింది. - 4లో



మూసీకి ఇన్‌ఫ్లో
మూసీ ప్రాజెక్టుకు ఇన్‌ఫ్లో వస్తోంది. దీంతో అధికారులు ఒక గేటును పైకెత్తి నీటిని దిగువకు వదులుతున్నారు. - 4లో

వాతావరణం
గరిష్టం/కనిష్టం 41°/29°
పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం ఉష్ణోగ్రత ఎక్కువగా ఉండడం వల్ల ఉక్కపోతగా ఉంటుంది.

న్యూస్‌రీల్‌

ఐటీఐ దరఖాస్తు గడువు పొడిగింపు

రామగిరి(నల్లగొండ): ఐటీఐ మొదటి విడత అడ్మిషన్ల కోసం దరఖాస్తుల స్వీకరణ గడువు జూన్‌ 19 వరకు పొడిగించినట్లు నల్లగొండ ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్‌ ఎం.గోపాల్‌రెడ్డి తెలిపారు. అర్హత గల అభ్యర్థులు www.iti.telangana.gov.in వెబ్‌సైట్‌ నందు మొబైల్‌ నంబర్‌తో రిజిస్టర్‌ చేసుకొని దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

ఆన్‌లైన్‌ దరఖాస్తులు అధికారులకు అందించాలి

నల్లగొండ టూటౌన్‌: రూ.లక్ష ఆర్థిక సాయం కోసం బీసీ కుల వృత్తిదారులు ఆన్‌లైన్‌లో చేసుకున్న దరఖాస్తులను మున్సిపాలిటీల్లో కమిషనర్లకు, మండలాల్లో ఎంపీడీఓలకు అందజేయాలని ఎంబీసీ జాతీయ కన్వీనర్‌ కొండూరు సత్యనారాయణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2021లో తీసిన కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు చెల్లుబాటు కానున్నట్లు పేర్కొన్నారు. అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

కొండమల్లేపల్లి పీహెచ్‌సీకి జాతీయ అవార్డు


ఎంపీపీ రేఖ చేతుల మీదుగా ఉత్తమ అవార్డు అందుకుంటున్న వైద్యాధికారి

కొండమల్లేపల్లి: కొండమల్లేపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం జాతీయ ఉత్తమ అవార్డు పొందింది. ఈ మేరకు దేవరకొండలో బుధవారం జరిగిన వైద్య ఆరోగ్య దినోత్సవంలో శాసన మండలి చైర్మన్‌ గుత్తా సుఖేందర్‌రెడ్డి, దేవరకొండ ఎమ్మెల్యే రమావత్‌ రవీంద్రకుమార్‌ల సమక్షంలో కొండమల్లేపల్లి ఎంపీపీ దూదిపాల రేఖ చేతుల మీదుగా పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్‌ ఉషారాణి అవార్డు అందుకున్నారు. ఈ పీహెచ్‌సీని ఎంపీపీ దూదిపాల రేఖ శ్రీధర్‌రెడ్డి దంపతులు దత్తత తీసుకొని రూ.20లక్షలతో మౌలిక వసతులు కల్పించి, సొంత నిధులతో ఐదుగురు సిబ్బందిని నియమించి జీతాలు చెల్లిస్తూ ఈ అవార్డు రావడానికి ఎంతో కృషి చేశారు. ఈ క్రమంలోనే గత నెలలో ఎన్‌క్యూఏఎస్‌(నేషనల్‌ క్వాలిటీ అష్యూరెన్స్‌ స్టాండర్డ్‌) కేంద్ర బృందం పీహెచ్‌సీని సందర్శించి పంపిన నివేదిక ఆధారంగా జాతీయ స్థాయిలో ఉత్తమ పీహెచ్‌సీ అవార్డుకు ఎంపికైంది.

నేడు పల్లె ప్రకృతి దినోత్సవం

నల్లగొండ: తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా గురువారం పల్లె ప్రకృతి దినోత్సవం నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా గ్రామాల్లో ఉదయం 7గంటల నుంచి ర్యాలీలు తీస్తారు. అనంతరం గ్రామ పంచాయతీల వద్ద జెండాలను ఆవిష్కరించి ఉదయం 9గంటలకు గ్రామ సభలు నిర్వహించి గ్రామాల్లో సాధించిన అభివృద్ధిపై చర్చిస్తారు. ఈ సందర్భంగా మల్టీ పర్పస్‌ వర్కర్లకు కిట్లు పంపిణీ చేసి ఉత్తమ సేవలందించిన వారిని సన్మానిస్తారని కలెక్టరేట్‌ అధికార వర్గాలు తెలిపాయి. సాయంత్రం జిల్లాలో ఉత్తమ అవార్డులు పొందిన వివిధ గ్రామాల సర్పంచ్‌లో హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో జరిగే కార్యక్రమానికి తరలి వెళ్లనున్నారు.

16న ఉపాధ్యాయులకు టెలీ కాన్ఫరెన్స్‌

నల్లగొండ: రాష్ట్ర విద్య పరిశోధన మండలి హైదరబాద్‌ ఆధ్వర్యంలో ఈ నెల 16వ తేదీ ఉదయం 11 గంటలకు టీశాట్‌ నెట్‌వర్క్‌ (నిపుణ) ఛానెల్‌ ద్వారా ప్రభుత్వ ప్రధానోపాధ్యాయులు, సైన్స్‌, గణిత ఉపాధ్యాయులకు, 8 నుంచి పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు సైన్స్‌ హాకతాన్‌ ఆన్‌లైన్‌ పోటీలు అనే అంశంపై టెలీ కాన్ఫరెన్స్‌ నిర్వహిస్తున్నట్లు డీఈఓ భిక్షపతి ఒక ప్రకటనలో తెలిపారు. ఎంఈఓలు, హెడ్‌మాస్టర్లు, అన్ని పాఠశాలల సిబ్బంది కాన్ఫరెన్స్‌లో పాల్గొనాలని కోరారు.

అభివృద్ధిలో నంబర్‌ వన్‌

- వసతుల కల్పనలోనూ తెలంగాణ ముందంజ
- వివిధ రంగాల్లో నల్లగొండ జిల్లా అద్భుత ప్రగతి సాధించింది
- వైద్య ఆరోగ్య దినోత్సవంలో మంత్రి జగదీశ్‌రెడ్డి


గర్భిణికి న్యూట్రిషన్‌ కిట్‌ అందజేస్తున్న మంత్రి జగదీశ్‌రెడ్డి, చిత్రంలో ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి, కలెక్టర్‌, అదనపు కలెక్టర్‌

నల్లగొండ: జాతీయంగా చూస్తే ప్రతిరంగం అభివృద్ధిలో తెలంగాణ నంబర్‌ వన్‌గా నిలిచిందని రాష్ట్ర విద్యుత్‌ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి అన్నారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా బుధవారం నల్లగొండలోని లక్ష్మీ గార్డెన్‌లో నిర్వహించిన తెలంగాణ వైద్య ఆరోగ్య దినోత్సవానికి మంత్రి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఒక రంగం అని కాదు.. ఏ రంగంలో చూసిన దేశంలో ఇతర రాష్ట్రాల కంటే తెలంగాణ దీర్ఘకాలిక అభివృద్ధితోపాటు మౌలిక వసతుల కల్పనలో ముందంజలో ఉందన్నారు. ఇటీవల నేను ఓ రైతుగా ఓ ఆవును కొనుగోలు చేయాలని ఎలాంటి ప్రొటోకాల్‌ లేకుండా గుజరాత్‌కు వెళ్లి చూస్తే అక్కడి ప్రభుత్వ వైద్య, విద్యారంగాల పరిస్థితి మరీ దారుణంగా ఉందన్నారు. గుజరాత్‌లో వైద్యమే కాదు ప్రభుత్వ విద్య కూడా సక్రమంగా అందడం లేదన్నారు. దేశంలో ఏ పోటీలు పెట్టినా తెలంగాణకే పతకాలు వస్తున్నాయన్నారు. ఇటీవల పారిశుద్ధ్యంపై జాతీయ స్థాయిలో వచ్చిన అవార్డుల్లో తెలంగాణకే 40 అవార్డులు వచ్చాయంటే అది కేసీఆర్‌ తీసుకుంటున్న విప్లవాత్మక నిర్ణయాల వల్లేనని గుర్తు చేశారు.

వైద్య, వ్యవసాయ రంగంలో నల్లగొండ అగ్రగామి

తెలంగాణలో వైద్య, వ్యవసాయ రంగాల్లో నల్లగొండ జిల్లా అగ్రగామిగా నిలిచిందని మంత్రి జగదీశ్‌రెడ్డి అన్నారు.


నృత్యం చేస్తున్న డీఎంహెచ్‌ఓ కొండల్‌రావు, సిబ్బంది

ఉమ్మడి జిల్లాలో రెండు మెడికల్‌ కాలేజీలను నిర్మించుకుంటున్నామన్నారు. పీహెచ్‌సీల్లో కూడా ఇవాళ ప్రసవాలు జరుగుతున్నాయన్నారు. బస్తీ దవాఖానాలతో ఎంతో మేలు జరుగుతుందన్నారు. నాడు డయాలసిస్‌కు హైదరాబాద్‌ వెళ్లాల్సిన పరిస్థితి. నేడు పీహెచ్‌సీల్లో కూడా డయాలసిస్‌ సేవలు అందుతున్నాయన్నారు. నల్లగొండ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వాసుపత్రులు ఎంతో మెరుగుపడ్డాయన్నారు. వైద్య రంగంలో నల్లగొండ హబ్‌గా మారిందన్నారు. జిల్లా కలెక్టర్‌ వినయ్‌ కృష్ణారెడ్డి వైద్య ఆరోగ్య శాఖకు సంబంధించిన ప్రగతి నివేదికను చదివి వినిపించారు. ఈ సందర్భంగా మంత్రి కేసీఆర్‌ న్యూట్రిషన్‌ కిట్లను అందించారు. అనంతరం ఎమ్మెల్యే వైద్య రంగంలో ఉత్తమ సేవలందించిన వారికి అవార్డులు అందజేశారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బంది నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో అదనపు కలెక్టర్‌ ఖుష్బూగుప్తా, మున్సిపల్‌ చైర్మన్‌ సైదిరెడ్డి, రమేష్‌, విజయలక్ష్మి, కరీంపాష, లక్ష్మయ్య, వెంకట్‌రెడ్డి, శ్రీనివాస్‌, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి కొండల్‌రావు, రాజ్‌కుమార్‌, లచ్చూనాయక్‌ తదితరులు పాల్గొన్నారు.

సంతకాలు తీసుకున్నాకే బిల్లులు చెల్లించాలి

- జెడ్పీ చైర్మన్‌ బండ నరేందర్‌రెడ్డి



మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్‌ నరేందర్‌రెడ్డి

నల్లగొండ: గ్రామాల్లో విద్యుత్‌ పనులు పూర్తిచేసిన కాంట్రాక్టర్లు సంబంధిత రైతుల వద్ద సంతకాలు తీసుకున్న తర్వాతే బిల్లులు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని జెడ్పీ చైర్మన్‌ బండ నరేందర్‌రెడ్డి అన్నారు. బుధవారం నల్లగొండలోని జిల్లా పరిషత్‌ మీటింగ్‌ హాల్‌లో 1, 2, 4, 7 స్థాయీ సంఘాల సమావేశాలు నిర్వహించారు. వాటికి జెడ్పీ చైర్మన్‌ అధ్యక్షత వహించి మాట్లాడుతూ ట్రాన్స్‌ఫార్మర్లు బిగించే సందర్భంలో రైతులతో పనులు చేయిస్తూ కాంట్రాక్టర్లు మాత్రం బిల్లులు తీసుకుంటున్నారన్నారు. ఈ సందర్భంగా పలు విషయాలను చర్చించారు. అనంతరం జెడ్పీ వైస్‌ చైర్మన్‌ ఇరిగి పెద్దులు అధ్యక్షతన 3వ స్థాయీ సంఘం సమావేశం నిర్వహించారు. 5వ స్థాయీ సంఘం సమావేశానికి చైర్మన్‌ కంకనాల ప్రవీణ, 6వ స్థాయీ సంఘం సమావేశానికి నారబోయిన స్వరూపారాణి అధ్యక్షత వహించారు. ఆయా శాఖల గురించి చర్చించారు. సమావేశాల్లో సీఈఓ ప్రేమ్‌కరణ్‌రెడ్డి, డిప్యూటీ సీఈఓ కాంతమ్మ, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

చేపపిల్లల పంపిణీ పకడ్బందీగా చేపట్టాలి

నల్లగొండ టూటౌన్‌: ఉచిత చేపపిల్లల పంపిణీని పకడ్బందీగా చేపట్టాలని రాష్ట్ర మత్స్యకార సహకార సంఘాల సమాఖ్య చైర్మన్‌ పిట్టల రవీందర్‌ అన్నారు. బుధవారం హైదరాబాద్‌ నుంచి మత్స్య శాఖ అధికారులతో టెలీకాన్ఫరెన్స్‌ నిర్వహించి మాట్లాడారు. మత్స్యకారుల సంక్షేమానికి బీఆర్‌ఎస్‌ ప్రభుత్వం ఉచితంగా చేప పిల్లలు పంపిణీ చేస్తోందన్నారు. మత్స్యకార సంఘాల్లో సభ్యత్వాన్ని కల్పించే విషయంలో జిల్లా మత్స్యశాఖ అధికారులు ప్రత్యేక చొరవ చూపాలన్నారు. టెలీ కాన్ఫరెన్స్‌లో జిల్లా నుంచి మత్స్యశాఖ జిల్లా అధికారి వెంకయ్య, ఇతర అధికారులు పాల్గొన్నారు.

కాల్వ కట్టకు మరమ్మతులు చేయండి

- సీఎం కేసీఆర్‌కు జూలకంటి రంగారెడ్డి లేఖ

మిర్యాలగూడ: నాగార్జున సాగర్‌ ఎడమకాల్వ కట్టకు రాష్ట్ర ప్రభుత్వం వెంటనే మరమ్మతులు చేపట్టాలని సీపీఎం సీనియర్‌ నేత, మిర్యాలగూడ మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి కోరారు. ఈ మేరకు బుధవారం ఆయన తెలంగాన సీఎం కేసీఆర్‌కు లేఖ రాశారు. మిర్యాలగూడ మండలం ఐలాపురం బ్రిడ్జి నుంచి వేములపల్లి అన్నపరెడ్డిగూడెం గ్రామం వరకు గత సంవత్సరం నాగార్జునసాగర్‌ మేజర్‌ ఎడమకాల్వ అక్కడక్కడా తెగిపోయి గండ్లు పడి పొలాలు కొట్టుకొనిపోయాని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో వివిధ గ్రామాల్లోకి వరద నీరు రావడంతో కాలనీలు, రోడ్లు అస్తవ్యస్తంగా మారగా తాత్కాలికంగా ఇసుక బస్తాలు వేసి గండ్లు పూడ్చడం జరిగిందని లేఖలో పేర్కొన్నారు. ఈ ఏడాది ఆగస్టులో సాగర్‌ ఎడమకాల్వకు నీరు విడుదల చేసినప్పుడు ప్రస్తుతం ఉన్న గండ్లు, అడ్డుగా ఉన్న కంపచెట్ల వల్ల అక్కడక్కడా బలహీనంగా ఉన్న కట్టలు మరలా తెగిపోయే ప్రమాదం పొంచి ఉందని జూలకంటి తెలిపారు. అదేవిధంగా ఎడమకాల్వపై ఉన్న దాదాపు 43 లిఫ్టుల నిర్వహణ, పర్యవేక్షణకు అవసరమైన సిబ్బంది లేకపోవడంతో మరమ్మతులకు గురికాగా లిఫ్టులు సక్రమంగా పనిచేయడం లేదని ఆ లేఖలో వివరించారు. లిఫ్టుల నిర్వహణ రైతులకు భారంగా మారిందని, దీంతో ఆయకట్టు చివరి భూములకు నీరు అందక పొలాలు బీళ్లుగా మారుతున్నాయని పేర్కొన్నారు. ప్రాజెక్టులో నీరు ఉన్నప్పుడు కూడా చివరి భూముల రైతులకు నీరు అందకపోవడం దారుణమన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి బలహీనంగా ఉన్న సాగర్‌ ఎడమ కాల్వ కట్టలకు వెంటనే యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులను చేపట్టాలని, కాల్వలో మొలిచిన కంపచెట్లను తొలగించాలని, ప్రాజెక్టు పనుల అంతర్భాగంగా లిఫ్టులకు అవసరమైన మరమ్మతులు చేపట్టి సిబ్బందిని నియమించి రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు.

స్వరాష్ట్రంలో భయపడే రోజులు తెచ్చారు


కనగల్‌ మండలంలో కొనసాగుతున్న సీఎల్పీ నేత భట్టి విక్రమార్క పాదయాత్ర

- సీఎల్పీ నేత భట్టి విక్రమార్క
- కనగల్‌ మండలంలో కొనసాగిన పీపుల్స్‌ మార్చ్‌ పాదయాత్ర

కనగల్‌: తెలంగాణలో బీఆర్‌ఎస్‌ ప్రభుత్వం అనుసరిస్తున్న తప్పుడు విధానాలను ప్రశ్నిస్తే అక్రమ కేసులు బనాయించి ఎక్కడ జైల్లో వేస్తారని భయపడే రోజులు తెచ్చారని సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క అన్నారు. బుధవారం ఆయన చేపట్టిన పీపుల్స్‌ మార్చ్‌ పాదయాత్ర గుర్రంపోడు మండల పరిధిలోని లక్ష్మీదేవిగూడెం నుంచి ఉదయం 10గంటలకు కనగల్‌ మండలం లచ్చుగూడెం స్టేజి వద్దకు చేరుకుంది. ఈ సందర్భంగా ఆయనకు కాంగ్రెస్‌ పార్టీ శ్రేణులు ఘన స్వాగతం పలికారు. మహిళల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తమకు ప్రభుత్వం నుంచి ఇళ్లు, రేషన్‌ కార్డులు మంజూరు కావడం లేదని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్‌ అధికారంలోకి వచ్చాక అర్హులందరికీ రూ.5లక్షలతో పక్కా ఇల్లు కట్టించి ఇస్తుందన్నారు. అక్కడి నుంచి కనగల్‌ క్రాస్‌రోడ్డు వద్దకు 12గంటలకు చేరుకుని బహిరంగ సభలో మాట్లాడారు. ఆదిలాబాద్‌ నుంచి 1000 కిలో మీటర్లు పాదయాత్ర చేసుకుంటూ ఇక్కడకు వచ్చన్నారు. ఈ క్రమంలో అనేక మంది రైతులు, విద్యార్థులు, ఆడబిడ్డలు, అడవిలో ఉన్న ఆదివాసులు, గిరిజనులు, మైనార్టీలతో మాట్లాడానన్నారు. ఎవరితో మాట్లాడిన తెలంగాణ వస్తే మా బతుకులు మారుతాయి అనుకున్నామని, కానీ, ఎలాంటి మార్పు రాలేదని చెబుతున్నట్లు ఆయన తెలిపారు. ఉన్నత చదువులు చదివిన విద్యార్థులు నేడు కూలీలు మారి కుల వృత్తులు చేసుకోవాల్సినన పరిస్థితి దాపురించిందన్నారు. కృష్ణానదిపై జూరాల, నెట్టంపాడు, కల్వకుర్తి, శ్రీశైలం, కోయిల్‌సాగర్‌, భీమా, నాగర్జునసాగర్‌ ప్రాజెక్టును కాంగ్రెస్‌ ప్రభుత్వమే కట్టిందన్నారు.

ఎస్‌ఎల్‌బీసీని మేమే పూర్తిచేస్తాం..

ఎస్‌ఎల్‌బీసీ టన్నెల్‌ కూడా మేమే మొదలు పెట్టామని, చివరికి దాన్ని కూడా పూర్తిచేసి నల్లగొండ జిల్లాకు సాగు నీరందిస్తామన్నారు. సభ అనంతరం మండల కేంద్రంలోని వంతెన వద్ద ఏర్పాటు చేసిన వ్యవసాయ పొలం వద్ద భోజనం చేసి తిరిగి సాయంత్రం 6గంటలకు పాదయాత్ర మొదలు పెట్టాడు. అక్కడి నుంచి పర్వతగిరి, దర్వేశిపురం గ్రామాల మీదుగా వెళ్లి నల్లగొండ మండల పరిధిలోని జి.చెన్నారం గ్రామానికి చేరారు. దర్వేశిపురం ఆలయం వద్ద పూజలు చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్‌ పార్టీ నాయకులు దుబ్బాక నర్సింహారెడ్డి, పున్న కైలాష్‌నేత, నర్సింగ్‌ శ్రీనివాస్‌గౌడ్‌, గడ్డం అనూప్‌రెడ్డి, గుమ్ముల మోహన్‌రెడ్డి, నర్సింగ్‌ సునితాకృష్ణయ్యగౌడ్‌, హఫీజ్‌, గోలి జాగల్‌ రెడ్డి, దేవిరెడ్డి వెంకట్‌రెడ్డి, జిల్లేపల్లి పరమేష్‌ ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే మెరుగైన వైద్యసేవలు


మాట్లాడుతున్న మాతృనాయక్‌

దేవరకొండ: ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే రోగులకు మెరుగైన వైద్యసేవలు అందిస్తున్నట్లు డీసీహెచ్‌ఎస్‌ మాతృనాయక్‌ అన్నారు. బుధవారం దేవరకొండ ఏరియా ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దేవరకొండ ప్రభుత్వ ఆస్పత్రిలో జిల్లాలోనే అత్యధికంగా సాధారణ కాన్పులు జరుగుతున్నట్లు తెలిపారు. కాన్పుల్లో మిర్యాలగూడ ఆస్పత్రి 63శాతం ఉండగా దేవరకొండ ఆస్పత్రి 68శాతంతో ముందుందని ఆయన పేర్కొన్నారు. అంతేకాకుండా అవుట్‌ పేషెంట్‌, ఇన్‌ పేషెంట్ల నమోదులో సైతం దేవరకొండ ప్రాంతీయ ఆస్పత్రి టాప్‌ ప్లేస్‌లో ఉందన్నారు. దేవరకొండ 100పడకల స్థాయి ఆస్పత్రిగా ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదనలు పంపనున్నట్లు పేర్కొన్నారు. ఆయన వెంట ఆస్పత్రి సూపరింటెండెంట్‌ రాములు నాయక్‌ ఉన్నారు.

వ్యవసాయాధికారితో ఫోన్‌ ఇన్‌



ప్రస్తుత వానాకాలం సీజన్‌లో ముందస్తు సాగుపై అనుమానాలు ఉన్నాయా.. విత్తనాలు, ఎరువుల కొరత ఎదుర్కొంటున్నారా.. నకిలీ విత్తనాల బెడద ఉందా.. అయితే, జిల్లా వ్యవసాయ అధికారి సుచరితకు ఫోన్‌ చేసి మీ సందేహాలను నివృత్తి చేసుకోండి. ఏ పంటలు సాగుచేయాలనే విషయాలను కూడా అడిగి తెలుసుకోవచ్చు.

ఫోన్‌ ఇన్‌ తేదీ : 16.06.2023 (శుక్రవారం)
సమయం : ఉదయం 9.30 నుంచి 10.30 గంటల వరకు
ఫోన్‌ చేయాల్సిన నంబర్‌ : 72888 94477




ఖిలాపై నిర్మించిన మహల్

కళ్యాణ చాళుక్యుల నుంచి స్వదేశీ దర్శన్‌కు..

ఖిలా.. దశ తిరిగేలా

క్రీ.శ.1100 ముందు నుంచే రాజుల ఏలుబడిలో భువనగిరి కోట

- పర్వతారోహణకు కేంద్రంగా..
- ఎవరెస్ట్, కిలిమంజారో, మౌంట్ ఎల్‌బ్రోస్ పర్వతాలను అధిరోహించిన ఇక్కడి శిక్షకులు
- పర్యాటకంగానూ ప్రసిద్ధి
- ఖిలా అభివృద్ధికి రూ.100 కోట్లు
- స్వదేశీ దర్శన్–2 కింద కేటాయించిన కేంద్ర ప్రభుత్వం
- రోప్ వే, మ్యూజియం, రెస్టారెంట్లు, లేజర్ షో వంటివి ఏర్పాటు





రాక్ క్లైంబింగ్ చేస్తున్న యువతి

కళ్యాణీ చాళుక్య చక్రవర్తి త్రిభువనమల్లుడి నుంచి నిజాం నవాబుల వరకు ఎన్నో చారిత్రక అంశాలకు నిలువెత్తు సాక్షి భువనగిరి ఖిలా. రాజుల కాలం ముగిసిన తర్వాత పర్యాటక కేంద్రంగా విరాజిల్లుతోంది. ఏకశిలతో నిర్మితమైన ఈ కోటను నిత్యం వందలాది మంది సందర్శిస్తుంటారు. అంతే కాదు.. అడ్వెంచర్ కేంద్రంగా యువతీయువకులు రాక్ క్లైంబింగ్, ర్యాప్లింగ్ శిక్షణ పొందుతున్నారు. ఇక్కడ శిక్షణ పొందిన పలువురు ఎవరెస్టు, కిలిమంజారో, మౌంట్ ఎల్‌బ్రోస్ వంటి ఎత్తయిన పర్వతాలను అధిరోహించి దేశ కీర్తిని ప్రపంచ నలుదిశలా చాటారు. పర్యాటలకు మరింతగా ఆకర్షించేందుకు కేంద్ర ప్రభుత్వ స్వదేశీ దర్శన్–2కింద రూ.100 కోట్లు కేటాయించింది.

–సాక్షి నల్లగొండ డెస్క్



కోటపై ఫిరంగి

చారిత్రక నేపథ్యం కలిగిన భువనగిరి ఖిలా(కోట) ఆధునిక కాలంలో పర్యాటక కేంద్రంగా, రాక్ క్లైంబింగ్, ర్యాప్లింగ్ శిక్షణకు కేరాఫ్‌గా మారింది. ఇక్కడ పర్యాటకశాఖ సహకారంతో నిర్వహిస్తున్న రాక్ క్లైంబింగ్ కోచింగ్ స్కూల్ ద్వారా వేలాది మంది పర్వతారోహణకు ఓనమాలు దిద్దారు. నానాటికీ పెరుగుతున్న పర్యాటకులను ఆకర్షించేందుకు ఇప్పటికే కోటపైకి ఉన్న మెట్ల మార్గాన్ని అభివృద్ధి చేశారు. రోప్‌వే నిర్మాణం ప్రతిపాదనలో ఉంది. వీటితో పాటు కోటపైన మౌలిక వసతులు కల్పించడానికి ప్రతిపాదనలు తయారు చేశారు. శని, ఆదివారాలు, ప్రత్యేక రోజుల్లో ఖిలాపైకి పర్యాటకులు పెద్ద ఎత్తున వస్తున్నారు. వీరి కోసం పర్యాటక శాఖ ప్రత్యేకంగా గైడ్‌ను ఏర్పాటు చేసింది.



ఖిలాపై బురుజు

రూ.100 కోట్లతో చేపట్టనున్న పనులు

భువనగిరి ఖిలాను అభివృద్ధి చేయడానికి కేంద్రం స్వదేశీ దర్శన్–2లో భాగంగా రూ.100 కోట్లు కేటా యించింది. భువనగిరి ఖిలాపైకి రోప్ వే నిర్మాణం ద్వారా పర్యాటకులను ఆకర్షించాలన్నది కేంద్ర ప్రభుత్వ సంకల్పం. వరంగల్, యాదాద్రి,కొలనుపాకకు వచ్చిపోయే వేలాది మందిని ఇక్కడికి ఆహ్వానించే కార్యక్రమం చేపడుతున్నారు. అలాగే ఖిలాపై పర్యాటకుల కోసం వివిధ వసతులు కల్పించనున్నారు. అందులో ప్రధానంగా చిన్నపిల్లలకు ఆట పరికరాలు, మ్యూజియం, నీటి కొలను సుందరీకరణ, రెస్టారెంట్లు, మంచినీటి సౌకర్యం, కోట చారిత్రకతను తెలిపే లేజర్ షో వంటివి ఏర్పాటు చేయనున్నారు. ఖిలా దిగువ భాగంలో మంచినీటి సౌకర్యం, వాష్ రూంలు, రెస్టారెంట్ ఏర్పాటు చేయనున్నారు. ఇందుకు సంబంధించి డీపీఆర్ రూపొందించే బాధ్యతలను ఎల్‌అండ్‌టీ సంస్థకు కేంద్ర ప్రభుత్వం అప్పగించింది. ఇందులో భాగంగా కంపెనీ ప్రతినిధులు ఇటీవల కలెక్టర్ పమేలా సత్పతిని కలిసి చర్చించారు.

ఖిలా చరిత్ర ఇదీ..

చరిత్రలో తెలంగాణను ఏలిన అందరి ఏలుబడిలో భువనగిరి ప్రాంతం వుంది. మూసీ నది ప్రాంతాన్ని జయించిన మహాపద్మనందులు, ఆ తర్వాత మౌర్యులు, పిదప మహిషకుడు ఖారవేలుడి ఏలుబడిలో వుండి వుంటుంది భువనగిరి. శాతవాహనుల నుంచి ఆసఫ్జాహీల దాకా వివిధ రాజుల రాజ్యాల్లో భువనగిరి భాగమై వుంది. శాసనాల దాఖలా ప్రకారం క్రీ.శ.1100కు ముందునుండే భువనగిరి దుర్గం కళ్యాణీ చాళుక్యుల పాలనలో వుంది. అప్పుడిది కొలనుపాకకు రక్షణ, ప్రధానంగా సైనిక దుర్గంగా ఉన్నట్లు చరిత్ర చెబుతుంది.

బోనయ్య, గిరమ్మల పేరున నిర్మించిందే భువనగిరి కోట

జానపదుల పేరు మీద ఏర్పడ్డదే భునగిరి ఖిలా. అప్పట్లో ఒక రాజు ఇప్పటి రాయగిరి రైల్వేస్టేషన్ (ఒకప్పటి తిరుమలగిరి తండా) దగ్గరి మల్లన్నగుట్ట మీద కోట కట్టబోతుంటే బోనయ్య అనే గొల్లాయన ఈడ కోటేం కట్టరుగని మీకు మంచి జాగ జూపిస్త రమ్మని తీసుకపోయి బోనగిరిగుట్టను చూపెట్టిండంట. దాని మీది కప్పివున్న తీగెలపాద మొదలు హనుమాపురం వరకు ఉండెనట. దాన్ని నరికి రాజుకు గుట్ట చూపెడితే రాజు రాయిగిరిలో కోట కట్టుడాపి బోనగిరిగుట్ట మీద ఖిల్లా నిర్మించిండట. రాజు ఇనామిస్తనంటే బోనయ్య తన పేరు, తన భార్యపేరు గిరమ్మ కలిసొచ్చేటట్లు ఊరు కట్టియ్యమన్నడంట. దీంతో రాజు తథాస్తన్నడు. బోనయ్య, గిరమ్మల పేరు మీద 'బోనగిరి'ని కట్టించిండు రాజు. ఆ బోనగిరే ఇప్పుడు భువనగిరిగా పిలువబడుతున్నది.

ఆసియాలోనే రెండవ ఏక శిలా పర్వతం

ఆసియాలోనే రెండవ ఏక శిలా పర్వతం భువనగిరి కోట. 600 మీటర్ల ఎత్తున్న ఈ కోట పట్టు కోల్పోకుండా పర్వాతారోహకులు శిక్షణ పొందడానికి అనువుగా ఉంది. టెంజింగ్ నార్కె అవార్డు గ్రహీత శేఖర్‌బాబు 2013 సెప్టెంబర్‌లో భువనగిరి కోట వద్ద రాక్ క్లైంబింగ్ శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించారు. ఐదు సంవత్సరాల నుంచి 65 ఏళ్ల వయస్సు వారికి ఇక్కడ నాలుగు విభాగాల్లో శిక్షణ ఇస్తారు. రాక్ క్లైంబింగ్(కొండను ఎక్కడం) ర్యాప్లింగ్(కొండపైనుంచితాడుతో దిగడం) జిప్‌లైన్(తీగమీద వెళ్లడం), క్యాంపింగ్ (టెంట్‌లో వసతులు ఏర్పాటు,నిద్ర వంటి) విషయాలపై శిక్షణ ఇస్తున్నారు. గ్రేడ్‌ల వారీగా శిక్షణ ఇస్తారు. ఒకరోజ, రెండు రోజులు, ఐదు రోజులు సర్టిఫికెట్ కోర్సులు, అడ్వాన్స్ శిక్షణ కూడా ఇస్తారు. రాక్ క్లైంబింగ్‌లో శిక్షణ పూర్తయిన అనంతరం హిమాలయల్లోని పర్వత సానువుల్లో శిక్షణ ఇప్పించి పర్వాతారోహణకు పంపిస్తారు. ఇందు కోసం రాక్ క్లైంబింగ్ నిర్వాహకులు ఫీజు తీసుకుంటారు. రాక్ క్లైంబింగ్ కోసం ట్రైనీ ఐఏఎస్‌లు, ఐపీఎస్‌లు తదితర ప్రముఖులు సైతం వస్తుంటారు. వేసవిలో బండ వేడెక్కుతుండడంతో మార్చి నుంచి జూన్ వరకు శిక్షణ నిలిపివేస్తారు.

రాక్ క్లైంబింగ్, ర్యాప్లింగ్‌లో శిక్షణ

రాక్ క్లైంబింగ్, ర్యాప్లింగ్ సాహసికులకు భువనగిరి కోట వేదికగా మారింది. హైదరాబాద్‌తో పాటు వివిధ ప్రాంతాల నుంచి శిక్షణ పొందడానికి పెద్ద ఎత్తున వస్తుంటారు. శిక్షణ ఇవ్వడానికి నలుగురు కోచ్‌లు ఉన్నారు. జూలై నుంచి ఫిబ్రవరి వరకు ఇక్కడ శిక్షణ ఇస్తారు.

మాలోతు పూర్ణా, ఆనంద్ ఇక్కడే కోచింగ్

సాంఘిక సంక్షేమ శాఖ గురుకుల పాఠశాలల విద్యార్థులు మాలోతు పూర్ణా, ఆనంద్ భువనగిరి ఖిలా వద్దనే ప్రాథమిక శిక్షణ పొందారు. పూర్ణా అతి చిన్న వయసులో ఎవరెస్ట్ శిఖరాన్ని అధిరోహించి రికార్డు సృష్టించారు. ఈమెతో పాటు ఇక్కడ శిక్షణ పొందిన సుమారు 90 మంది ఎవరెస్ట్ శిఖరాన్ని అధిరోహించి జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. అలాగే కిలిమంజారో పర్వతాన్ని 300 మంది. మౌంట్ ఎల్‌బ్రోస్ పర్వతాన్ని 100 మంది వరకు అధిరోహించారు. ప్రపంచంలోని ఏడు ఖండాల్లో ఉన్న ఎత్తయిన పర్వతాలను అధిరోహించడానికి ఇక్కడ శిక్షణ ఇస్తున్నారు. సాఫ్ట్‌వేర్ రంగం, ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థల విద్యార్థులు, కార్పొరేట్ సంస్థల ప్రతినిధులు సుమారు 10,000 మంది ఇక్కడ రాక్ క్లైంబింగ్, ర్యాప్లింగ్‌లో సర్టిఫికెట్ కోర్సులు పూర్తి చేశారు.

కుక్కడంలో తాళం వేసిన ఇంట్లో చోరీ

- తులంన్నర బంగారం, 15 తులాల వెండి, రూ. 18 వేల నగదు అపహరణ



చిందరవందరగా వస్తువులు

మాడుగులపల్లి: తాళం వేసిన ఇంట్లో దుండగులు చోరీకి పాల్పడ్డారు. తులంన్నర బంగారం, 15 తులాల వెండి ఆభరణాలు, రూ. 18 వేలు అపహరించారు. మండలంలోని కుక్కడం గ్రామంలో ఈ ఘటన జరగ్గా బుధవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. రామన్నపేట మండలం పల్లివాడ గ్రామానికి చెందిన దేశపాక జగపతిబాబు మూడేండ్లుగా ఇటిక్యాల గ్రామ పరిధిలోని ఓ రైస్‌మిల్లు డ్రైవర్‌గా పనిచేస్తూ కుక్కడం గ్రామంలో భార్య పిల్లలతో కలిసి అద్దెకు ఉంటున్నాడు. స్వగ్రామంలో బొడ్రాయి ప్రతిష్ఠ ఉండడంతో గత నెల 30న ఇంటికి తాళం వేసి వెళ్లారు. బుధవారం మధ్యాహ్నం తిరిగి రాగా ఇంటి తలుపుల తాళాలు పగులగొట్టి ఉన్నాయి. గదిలో వస్తువులు, బట్టలు చిందరవందరగా పడి ఉన్నాయి. సెల్ఫ్‌లో బట్టల కింద ప్లాస్టిక్ డబ్బాలో దాచిన బంగారు ఉంగరాలు, వెండి ఆభరణాలు, నగదు కనిపించలేదు. దాంతో చోరీ జరిగినట్లు నిర్ధారించుకొని బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఘటనాస్థలాన్ని పరిశీలించారు. కాగా ఇటీవల ఇదే గ్రామానికి చెందిన ఓ మహిళ ఇంట్లో చోరీకి చేసిన దుండగులు నగదు అపహరించారు. ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల బీరువాలను సైతం ధ్వంసం చేసి క్రీడా సామగ్రి ఎత్తుకెళ్లారు. వరుస దొంగతనాలు జరుగుతుండడంతో గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

మూసీకి కొనసాగుతున్న ఇన్‌ఫ్లో

కేతేపల్లి: మూసీ ప్రాజెక్టుకు ఎగువ నుంచి ఇన్‌ఫ్లో కొనసాగుతుంది. దీంతో అధికారులు ప్రాజెక్టు ఒక క్రస్టు గేటును పైకెత్తి నీటిని దిగువకు వదులుతున్నారు. బుధవారం ఎగువ నుంచి మూసీ ప్రాజెక్టుకు 150 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. ప్రాజెక్టులో నీటిమట్టం 645 అడుగుల గరిష్టస్థాయికి చేరువలో ఉండటంతో పాటు వర్షాకాలం సీజన్ ప్రారంభ సమయం కావటంతో ప్రాజెక్టులో నీటిమట్టాన్ని తగ్గించాలని అధికారులు నిర్ణయించారు. దీంతో ప్రాజెక్టు 3వ నంబరు క్రస్టు గేటును అర అడుగు మేర పైకెత్తి ఉంచి 300 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. మూసీ ప్రాజెక్టు ప్రస్తుత నీటిమట్టం 644.30 అడుగుల వద్ద ఉంది.

అన్నదానానికి విరాళం

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి సన్నిధిలోని దీక్ష పరుల మండపంలో నిర్వహిస్తున్న అన్నదానానికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అక్వా డెవలప్‌మెంట్ అథారిటీ (అప్సడా) వైస్ చైర్మన్ వడ్డి రఘురామ్ రూ.1,01,116లు విరాళముగా అందజేశారు. బుధవారం కుటుంబ సభ్యులతో కలిసి యాదాద్రీశుడిని దర్శించుకున్న వడ్డి రఘురామ్ గర్భాలయంలో స్వయంభూలను దర్శించుకున్నారు.

బైక్‌ను ఢీకొట్టిన కారు.. యువకుడు మృతి

బొమ్మలరామారం : కారు బైక్‌ను ఢీకొట్టడంతో యువకుడు మృతిచెందాడు. ఈ ఘటన బొమ్మలరామారం మండలంలో చోటు చేసుకుంది. బొమ్మలరామారం మండలంలోని గోవింద్ తండాకు చెందిన మేగావత్ ప్రతాప్ ప్లంబర్ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు.రోజు వారీగానే హైదరాబాద్‌లో పనులు ముగించుకొని బైక్‌పై స్వగ్రామానికి వస్తున్నాడు. ఈ క్రమంలో మండలంలోని చీకటిమామిడి గ్రామ శివారులో గల ఇండియన్ పెట్రోల్ బంక్ సమీపంలో హైదరాబాద్ వైపు వెళ్తున్న కారు చీకటిమామిడి వైపు వస్తున్న ప్రతాప్ బైక్‌ను ఢీ కొట్టింది.తీవ్ర గాయాలైన ప్రతాప్‌ను చికిత్స నిమిత్తం భువనగిరి జిల్లా ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు.

చనిపోతూ మరో ఐదుగురికి ప్రాణదానం

- చౌటుప్పల్ మండలం జైకేసారానికి చెందిన గీత కార్మికుడి బ్రెయిన్ డెడ్
- జీవన్‌దాన్ ఫౌండేషన్‌కు అవయవాల దానం
- పెద్ద మనసుతో ముందుకు వచ్చిన కుటుంబ సభ్యులు



భార్య, కుమారుడితో చంద్రయ్య

చౌటుప్పల్ : చౌటుప్పల్ మండలం జైకేసారం గ్రామానికి చెందిన పందుల చంద్రయ్యగౌడ్(60) తాను చనిపోతూ మరో ఐదుగురికి అవయవ దానం చేశాడు. గీత వృత్తితో పాటు కొద్దిపాటిగా ఉన్న భూమిలో వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. భార్య, ముగ్గురు కుమారులు ఉన్నారు. ఈనెల 11న అకస్మాత్తుగా బ్లడ్ ప్రెషర్‌కు గురయ్యాడు. దీంతో చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని కామినేని ఆసపత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స సమయంలో మంగళవారం బ్రెయిన్‌డెడ్‌కు గురయ్యాడు. వైద్యులు ఈ విషయాన్ని భార్య అండాలుతో పాటు, ఇతర కుటుంబ సభ్యులకు తెలియజేశారు. ఆ క్రమంలో కుటుంబ సభ్యులంతా కలిసి అవయవ దానం చేయాలని నిర్ణయించుకున్నారు. అందులో భాగంగా జీవన్‌ధాన్ ఫౌండేషన్‌కు కిడ్నీలు, కళ్లు, లీవర్ దానం చేశారు. తాను ఈ లోకాన్ని విడిచి వెళ్లిపోతూ మరో ఐదుగురికి ప్రాణదానం చేసిన లక్ష్మయ్యను, అందుకు ముందుకు వచ్చిన ఆయన కుటుంబ సభ్యులను పలువురు అభినందించారు.